భవనాల క్రమబద్ధీకరణకు ఒక్క ఛాన్స్

● వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా అనుమతి లేని కట్టడాలు
● జిల్లా వ్యాప్తంగా 2500 పైచిలుకు నిర్మాణాలు
● కడప కార్పొరేషన్‌లోనే వెయ్యి
● రెగ్యులర్ చేసుకుంటే ఖజానాకు రూ.50 కోట్ల ఆదాయం
● కడపలో రూ.20 కోట్లు పైమాటే



కడపలో నిర్మాణంలో వున్న భవనం

మున్సిపల్, కార్పొరేషన్‌లో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. ఫీజులు చెల్లించి ఇప్పుడు రెగ్యులర్ చేసుకుంటే ఆ నిర్మాణాలకు అన్ని అనుమతులు వచ్చేస్తాయి. ప్రభుత్వం ఇలాంటి వాటి కోసం బీపీఎస్ తీసుకువచ్చింది. ఇది అనుమతి లేని భవనాల క్రమబద్ధీకరణకు మంచి అవకాశం. కడప కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అనుమతి లేని అక్రమ కట్టడాలను రెగ్యులర్ చేసుకుంటే ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.50 కోట్ల మేర జమ కానుంది. ఒక్క కడపలోనే రూ.20 కోట్ల నుంచి 25 కోట్ల మేర వస్తుందని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): మున్సిపల్, కార్పొరేషన్‌లో నివాసగృహం, అపార్ట్‌మెంటు, కమర్షియల్ కాంప్లెక్స్ ఇలా ఏది నిర్మించాలన్నా టౌన్‌ప్లానింగ్ అనుమతులు తప్పనిసరి. ప్లానింగ్ మేరకు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. నివాసాల చుట్టూ సెట్‌బ్యాక్, కమర్షియల్, అపార్ట్‌మెంట్లకు సెల్లార్, ఇతరత్రా నిబంధనల మేరకు నిర్మాణాలు సాగించాల్సి ఉంది. అయితే కొందరు బిల్డర్లు డబ్బులు ఆదా చేసుకునేందుకు అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. జీప్లస్-2 తీసుకుని జీప్లస్ 4, జీప్లస్ 4 తీసుకుని జీప్లస్ 6 ఇలా నిర్మాణాలు చేపడుతూ పార్కింగ్ కోసం సెల్లార్, సిల్ట్ ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. పేపరు లేకుండా ప్లాన్‌లో మాత్రం అన్నీ చూపిస్తారు. నిర్మాణాల్లో మాత్రం భారీ వ్యత్యాసాలుంటాయి. ఇవి తెలియక చాలా మంది అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేస్తే వాణిజ్య భవనాల్లో షాపింగ్ మాల్ నిర్వహిస్తున్నారు. అనుకోకుండా అగ్నిప్రమాదాలు జరిగితే ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనాల్లోకి మంటలు ఆర్పేందుకు ఫైరింజను కూడా వెళ్లలేని పరిస్థితి దాపురిస్తుంది. దీంతో పెద్ద ప్రమాదం చోటుచేసుకుని భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరుగుతుంది. గృహ, అపార్ట్‌మెంటు, కమర్షియల్ నిర్మాణాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తూ వస్తాయి. కానీ వైసీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా భవనాలు, కమర్షియల్ భవనాలు, వాణిజ్య భవనాలతో పాటు అడ్డగోలుగా లేఅవుట్లు వేశారు. కొందరు వైసీపీ నేతలే రియల్టర్, బిల్డర్ల అవతారమెత్తి లేఅవుట్లు, బిల్డింగులు భవన నిర్మాణాలు చేపట్టారు. వారంతా కీలకమైన వైసీపీ నేతలు కావడంతో వీరి అడ్డగోలు భవన నిర్మాణాలు, అనుమతులు లేని లేఅవుట్లను టౌన్‌ప్లానింగ్ అధికారులు కట్టడి చేయలేకపోయారు. ఐదేళ్ల జగన్ హయాంలో భవనాల క్రమబద్ధీకరణ కోసం జీపీఎస్ కానీ, అనుమతులు లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్‌ను కానీ తీసుకురాలేదు. ఇలాంటి చోట ఇళ్లు స్థలాలు కొనుగోలు చేసిన జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ తీసుకురాగా ఇప్పుడు భవనాల క్రమబద్ధీకరణ కోసం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) తీసుకువచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 31లోపు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలను క్రమబద్ధీకరణ కోసం అవకాశం కల్పిస్తూ ఈ నెల 12న జీవో జారీ చేసింది.

అడ్డగోలుగా నిర్మాణాలు

జగన్ హయాంలో మేమేంది అనుమతి తీసుకునేది అంటూ కొందరు ప్లానుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే, మరికొందరను అసలే అనుమతులు తీసుకోలేదు. ఇలాంటి నిర్మాణాలు కడపలో సుమారు వెయ్యి దాకా ఉంటాయని అంచనా. టీకేఎం స్ట్రీట్, వైవీ స్ట్రీట్, అల్మాస్‌పేట, ఆర్టీసీ బస్టాండు, సెవెన్‌రోడ్స్, మద్రాసురోడ్డు, అప్సరాసర్కిల్, ఎర్రముక్కపల్లె ఇలా నగర నలుమూలలా నివాస, అపార్ట్‌మెంట్లే కాకుండా కమర్షియల్ భవనాల్లో కూడా అనుమతి లేకుండానే నిర్మించారు. స్టేట్‌లో అప్పుడు అధికారంలో వైసీపీ ఉంది, పాలకవర్గం వైసీపీనే ఉంది. తమ రాజ్యంలో మమ్మల్ని ఎవరు అడిగేదన్నట్లుగా బరితెగించి కట్టారు. కళ్ల ముందే అక్రమ కట్టడాలను కూడా పట్టించుకోని పరిస్థితి. అయితే ఇప్పుడు బీపీఎస్ రూపంలో వీటి రెగ్యులర్ కోసం కూటమి ప్రభుత్వం అవకాశమిచ్చింది. వచ్చే ఏడాది మార్చి 12 వరకు దరఖాస్తుకు అవకాశమిచ్చింది. జగన్ ఐదేళ్ల హయాంలో బీపీఎస్ స్కీం తీసుకురాలేదు. ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువ ప్రకారం ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. కడపలోనే సుమారు వెయ్యి దాకా ఉన్నాయి. వీటి ద్వారా ఫీజుల రూపంలో తీసుకుంటే కార్పొరేషన్‌కు సుమారు రూ.25 కోట్ల మేర ఆదాయం వస్తుంది. ఇక కడప తరువాత ప్రొద్దుటూరు మున్సిపాలిటీ జిల్లాలో పెద్దసిటీ. అక్కడ ప్రభుత్వ రూల్స్ లేనట్లుగా పాలన సాగింది. కమిషనరు, టౌన్‌ప్లానింగ్ అంతా వైసీపీ కనుసన్నల్లో పాలన సాగిందంటారు. అక్కడ టౌన్‌ప్లానింగ్‌లో పనిచేసిన అధికారి అవినీతి కింగ్ అని చెబుతారు. ఆయన ఉన్నప్పుడే ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ విభాగం అక్రమాలకు కేరాఫ్‌గా మారిందని చెబుతారు. అక్కడ కూడా కనీసం 300కు పైగా అడ్డగోలు భవనాలు నిర్మించినట్లు తెలిపారు. అక్కడ కూడా రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల మేర ఫీజుల రూపంలో వస్తుందని చెబుతున్నారు. ఇక పులివెందుల, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కమలాపురం ఇలా మొత్తం కలుపుకుంటే అనుమతులు లేని భవనాల నిర్మాణం సుమారు 2500కు పైగా ఉంటాయి. వీటన్నింటినీ క్రమబద్ధీకరించుకుంటే సుమారు 50 కోట్ల మేర ఖజానాకు జమ అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలిసో తెలియకో నిర్మాణాలు చేపట్టిన వారు, అడ్డగోలు అనుమతి లేని చోట్ల ఇళ్లు, ఇతర భవనాలు కొనుగోలు చేసిన వారు ఇబ్బంది పడుతూ వచ్చారు. అయితే ఇప్పుడు వాటి క్రమబద్ధీకరణ కోసం మంచి అవకాశం వచ్చింది. ఓ విధంగా అనుమతి లేని నిర్మాణాలకు ఇది శుభవార్త లాంటిదే.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ



శివశంకర్ లోతేటి

కడప, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నెం.8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యుత్‌శాఖ టోల్‌ఫ్రీ నంబర్లు 1912 లేదా 18004251555333కు చాట్ చేయడం ద్వారా కూడా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ సదవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్: డీఆర్వో

కడప కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9-30 గంటల నుంచి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని, దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్ లో జరిగే పీజీఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపాలన్నారు. 10 గంటల నుంచి సభాభవనంలో అర్జీల స్వీకరణ ఉంటుందని తెలిపారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీలు ఏదశలో ఉన్నాయి ? పరిష్కారమయ్యాయా ? అనే విషయాలను తెలుసుకొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

అది రేటు...!

● ఆశాజనకంగా టమోటా ధరలు



ములకలచెరువు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మార్కెట్‌లో ఆదివారం 22 కేజీల బాక్సు రూ.700 నుంచి రూ.950 వరకు పలికాయి. వారం రోజుల క్రితం రూ.500 మాత్రమే పలికిన ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇటీవల తుఫాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. అలాగే కాయలపై మచ్చలు వచ్చాయి. దీంతో టమోటాల దిగుబడి భారీగా తగ్గిపోయింది. 15 రోజుల క్రితం వరకు మార్కెట్‌కు 60 వేల బాక్సుల కాయలు అమ్మకానికి వచ్చేవి. ప్రస్తుతం కేవలం 10 వేల నుంచి 15 వేల బాక్సుల కాయలు మాత్రమే వస్తున్నాయి. అలాగే గతంలో ప్రతిరోజూ మార్కెట్ నుంచి 50 లారీల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ఇప్పుడు కేవలం 10 లారీల కాయలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. దీంతో టమోటా మార్కెట్ వెలవెలబోతోంది.

19న సీఎం చంద్రబాబు రాక



కడప, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 19న కమలాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డికి తెలియజేసినట్లు సమాచారం. కాగా సీఎం పర్యటన పెండ్లిమర్రి మండలమా, లేక వీఎన్‌పల్లె మండలమా అనేది ఇంకా ఖరారు కాలేదని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఆదివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

వేడుకగా పడిమెట్ల పూజ

● అయ్యప్పశరణుతో మారుమోగిన ఆలయం



పడిమెట్ల పూజలో అయ్యప్ప మాలధారులు, భక్తులు

ఖాజీపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పూసలకొట్టాల సమీపంలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి పడిమెట్ల పూజ వేడుకగా నిర్వహించారు. కేరళ అయ్యప్పస్వామి గుడిలో 16వ తేది చేయడంతో ఇక్కడ కూడా అదే రోజు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని పడిమెట్లకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో బిక్ష ఏర్పాటు చేయడంతో పాటు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు. స్థానిక సీఐ వంశీధర్ పడిమెట్ల పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సబ్‌జైలుకు కిడ్నీ రాకెట్ నిందితులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసు ఓ మహిళ హత్యకు కారణమైన నిందితులను పోలీసు లు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వా సుపత్రికి చికిత్స నిమి త్తం తీసుకొచ్చి అక్కడ డాక్టరు పరీక్షలు నిర్వహించిన అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించారు.

ఇందులో డాక్టర్ ఆంజనేయులు, బాలరంగడు, మెహరాజ్, పిల్లిపద్మ, సత్య, సూరిబాబు ఉన్నారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

కడప క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు సంబంధించి ప్రస్తుతం పనిచేస్తున్న, బదిలీ అయిన సీఐల వివరాలిలా..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎ.సత్యనారాయణ	మదనపల్లె రూరల్, అన్నమయ్య	వీఆర్, అనంతపురం
రవినాయక్	శ్రీసిటీ-3, పీఎస్, తిరుపతి	మదనపల్లె రూరల్
చంద్రశేఖర్	డీసీఆర్‌బీ, చిత్తూరు	రైల్వేకోడూరు పీఎస్
హేమసుందరరావు	రైల్వేకోడూరు పీఎస్,	పోరుమామిళ్ల సర్కిల్
శ్రీనివాసులు	పోరుమామిళ్ల సర్కిల్	రైల్వేకోడూరు సర్కిల్
వెంకటేశ్వర్లు	రైల్వేకోడూరు సర్కిల్	ఎస్‌బీ-3, అన్నమయ్య
ఏపీ మస్తాన్	గుంతకల్లు టూటౌన్ యూపీఎస్	రాజంపేట రూరల్
బీవీ రమణ	రాజంపేట రూరల్‌సర్కిల్	వీఆర్ రేంజ్ ఆఫీసు
టి.బాబు	ఒంటిమిట్ట సర్కిల్	ఎహెచ్‌టీయూ, అన్నమయ్య
నరసింహరాజు	వీఆర్ చిత్తూరు	ఒంటిమిట్ట సర్కిల్
రామచంద్ర	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య	కలికిరి యూపీఎస్
చంద్రశేఖర్	సోషల్‌మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, కడప	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్
సురేశ్‌రెడ్డి	ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య	కడప ట్రాఫిక్ పీఎస్
జావీద్	కడప ట్రాఫిక్ పీఎస్, కడప	సోషల్ మీడియా అండ్ సైబర్‌క్రైం, కడప
మోహన్‌కుమార్	వీఆర్, అన్నమయ్య	ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య

ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా త్రివిక్రంరెడ్డి



త్రివిక్రంరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (జోన్4) అధ్యక్షుడిగా ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనపర్తి త్రివిక్రంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం ప్రొటెం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు త్రివిక్రంరెడ్డి తెలిపారు. ఎన్నికల పరిశీలకుడిగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్ పర్యవేక్షించారన్నారు. ఈ సందర్భంగా త్రివిక్రంరెడ్డి మాట్లాడుతూ తనపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానన్నారు. నిరంతరం పారదర్శకతతో విద్యార్థుల శ్రేయస్సు, సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. కాగా త్రివిక్రంరెడ్డిని రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రిన్సిపాల్స్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

● ప్రమాణస్వీకారం చేసిన నూతన పాలకవర్గం



ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, కడప చైర్మన్‌గా ఎంపికైన అంబారపు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

కడప (ఎడ్యుకేషన్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూ షన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) కడప జిల్లా అధ్యక్షుడిగా ఏవీఆర్ టెక్నో స్కూల్స్ అధినేత ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఆ శాఖ కార్యాలయంలో ఆదివారం జరిగిన 36వ సర్వసభ్య సమావేశం సందర్భంగా కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్న అనంత రం బాధ్యతలు స్వీకరించారు. గౌరవ కార్యదర్శిగా సహాయ గనుల అధికారి ఇంజనీర్ ఎం.వెంకటేశ్ బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గ సభ్యులుగా వైపీ వెంకటరమణయ్య, బి.వేణుగోపాల్, గంజికుంట గణేశ్, విపిన్ కుమార్ శర్మ, ఆర్.నరేంద్ర రావు, డి.లక్ష్మిపతి, వై.వెంకటరమణ, జి.కృష్ణకిషోర్, కె.ప్రసాద్, ఎం.షెహనాజ్, టి.లక్ష్మీభాస్కర్, ఓ.వాసుదేవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన చైర్మన్ ఇంజనీర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కడప కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గౌరవ కార్యదర్శి ఇంజనీర్ ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా సెంటర్‌ను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తానని తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యుల సమక్షంలో మాజీ చైర్మన్ డాక్టర్ వి.ఆదినారాయణరెడ్డి నూతన చైర్మన్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ చైర్మన్లు, మాజీ గౌరవ కార్యదర్శులు, సభ్యులు తదితరులు కొత్తగా ఎన్నికైన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

● భారీగా తరలివచ్చిన హిందువులు
● హిందూ కార్తీక వనభోజనానికి అనూహ్య స్పందన
● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రవచనం చేస్తున్న స్వరూపానందస్వామి



స్వామి వారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


కడప కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. నగర శివారులోని లలితా పంచాయతన ఆలయంలో ఆదివారం ఉదయం 8-30 నుంచి 10-30 వరకు సాగిన శివపార్వతుల కల్యాణం ఆద్యంతం కనుల పండువగా నిర్వహించారు. ప్రజలు ఆది దంపతుల కల్యాణోత్సవాన్ని తిలకించి భక్తిపారవశ్యం పొందారు. అంతకుముందు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు లలితా పంచాయతన దేవాలయంలోని కంఠేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం 108 కలశ జలాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తీసుకువచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం ఉదయం 10-30 నుంచి 12-15 వరకు పీఠాధిపతులు, స్వామీజీలు, ప్రముఖులు, పెద్దలచే నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రజలను ఆలోచింపచేశాయి. ఇందులో ప్రధానంగా లలితాపీఠం, వశిష్టాశ్రమం శ్రీనివాస మంగాపురం (తిరుపతి) వ్యవస్థాపకుడు స్వరూపానందస్వామి, అచలానంద ఆశ్రమం (తోట్లపల్లి-బ్రహ్మంగారిమఠం) వ్యవస్థాపక అధిపతులు విరజానందస్వామి, ఇస్కాన్ ప్రతినిధి వైష్ణవ కృపదాస్ చేసిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి.

అనంతరం నిర్వహించిన హిందూ కార్తీక వనభోజనం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. స్వామి చిన్మయానందజీ దివ్య ఆశీస్సులతో లలితా పంచాయతన దేవాలయం స్వామి తురియానంద సరస్వతి నేతృత్వంలో హిందూ కార్తీక వనభోజన కమిటీ ప్రతినిధుల సారథ్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చిన్మయ మిషన్, ఏపీ జిల్లా గణేష్ ఉత్సవ సమితి, జిల్లా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, మహాదేవుని మహా శోభాయాత్ర కమిటీ, అయోధ్య శ్రీరామ శోభాయాత్ర కమిటీ ప్రతినిధుల సౌజన్యంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు తండోపతండాలుగా హాజరయ్యారు. కమిటీ ప్రతినిధులు వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వనభోజన కార్యక్రమం అనంతరం వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, హిందూ ధార్మిక వనభోజన కమిటీ ప్రతినిధులు బండి పిచ్చిరెడ్డి, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, లెక్కల కొండారెడ్డి, విజయానందరెడ్డి, రామమహేష్, వారణాసి శ్రీధర్‌శర్మ, చెన్నకృష్ణారెడ్డి, బండారు శివకేశవ్‌లతో పాటు పలువురు హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన ప్రజలు

నిండు నూరేళ్లు జీవించాల్సినవారు ఆ మలుపుల వల్ల వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. సురక్షితంగా తమ గమ్యానికి చేరుకుంటున్నాము అనుకొనేలోపే ఆ మలుపులు.. మృత్యు పిలుపులుగా మారుతున్నాయి. అంతవరకు సంతోషంగా ఉన్న ఆ కుటుంబాలు మలుపుల రూపంలో విషాదాన్ని నింపుతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. గత రెండు సంవత్సరాల కాలంలో ఆ మలుపులు వద్ద 20 నుంచి 25 ప్రమాదాలు జరగగా 10 నుంచి 15 మంది మరణించారు. అనేక మంది కాళ్లు, చేతులు పోగొట్టుకొని అవిటి వారైన సంఘటనలు ఉన్నాయి.


బొందాలవంక వద్ద ఉన్న మలుపు

ఆ మలుపులు.. మృత్యు పిలుపులు

● గాలిలో కలిసిపోతున్న ప్రజల ప్రాణాలు ● పట్టించుకోని అధికారులు


గోరాన్‌చెరువు మలుపులో రాయచోటి-గాలివీడు రోడ్డు మలుపు

గాలివీడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారి యమపాశాలుగా తయారయ్యాయి. ముఖ్యంగా గాలివీడు-కదిరి రోడ్డు మార్గంలోని వెలిగల్లు కాలనీ వద్ద, గుర్రాలమిట్ట వద్ద ఏడాదికి సరాసరి 5 నుంచి 10 ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలివీడు-రాయచోటి మార్గంలోని ఎగువగొట్టివీడు పంప్‌హౌస్ సమీపంలో ఉన్న మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కరిమిరెడ్డిగారిపల్లె క్రాస్ రోడ్డులోని గంగమ్మ గుడి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఉన్న మలుపుల్లో ఏడాది క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. రెండు రోజుల క్రితం ఒడిసెలవంకపల్లె వద్ద జరిగిన ప్రమాదంలో వరుణ్‌కుమార్ మరణించాడు. ఆగస్టు, సెప్టెంబరు నెలలోనే వివిధ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మరణించగా 8మందికి తీవ్రగాయాలయ్యాయి. అరవీడు రోడ్డు మార్గంలో ఎల్లంపల్లె, ఆంజనేయస్వామి, ఇతర మలుపుల వద్ద, గాలివీడు-కోనంపేట రోడ్డు మార్గంలోని పేరంపల్లి మిట్ట, గొందిపల్లె క్రాస్ వద్ద ఏడాదికి 10 నుంచి 15 ప్రమాదాలు జరుగుతున్నాయి. నూలివీడు పంచాయతీ బొందలవంక 'ఎస్' ఆకారంలో ఉండడం వల్ల, అలాగే మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడం, ఇంకొన్ని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకుండా వృక్షాలు అడ్డంగా ఉండటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మలుపులు లేని రోడ్లు ఏర్పాటు చేయాలి..

మండలంలోని కొన్ని రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. రోడ్డుపై అవగాహన లేనివారు, కొత్తవారు ఈ మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. గుర్రాలమిట్ట, గోరాన్‌చెరువు పంచాయతీల్లోని మలుపుల వద్ద, బొందలవంక, గొందిపల్లె మలుపుల వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ మలుపులు లేని రోడ్డును ఏర్పాటు చేయాలి.

- నరసారెడ్డి, గాలివీడు



సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

మండలం గుండా వివిధ జిల్లాలను కలుపుతూ ఉన్న ప్రతి రహదారిలోనూ మలుపులు ఉన్నాయి. అయితే చాలా మలుపుల వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని మలుపుల వద్ద పెద్ద చెట్లు అడ్డంగా ఉన్నాయి. అధికారులు స్పందించి చెట్లను తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- దేవేంద్ర, నాగూరివాండ్లపల్లె

క్వార్టర్ ఫైనల్ చేరుకున్న బేస్‌బాల్ జట్లు

రైల్వేకోడూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బుడుగుంటపల్లె పరిధిలో ఉన్న జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలలో ఆదివారం పలు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర పోటీలలో నెల్లూరు-ఈస్ట్ గోదావరి పైన 0-9, అనంతపురం-కడప పైన 5-3, శ్రీకాకుళం-కర్నూలు జట్టు పైన 6-1, విశాఖపట్నం-కృష్ణా పైన 6-2, చిత్తూరు-ప్రకాశం జట్టుపై 5-2, అనంతపురం-ఈస్ట్ గోదావరి జట్టుపై 4-3, కడప-నెల్లూరు జట్టుపై 5-1, విజయనగరం-శ్రీకాకుళం జట్టుపై 2-1, వెస్ట్ గోదావరి-కృష్ణ జట్టుపై 8-0, గుంటూరు-చిత్తూరు జట్టుపై 6-4, నెల్లూరు-అనంతపురం జట్టుపై 7-6, కడప-ఈస్ట్ గోదావరి జట్టు పై 12-1, కర్నూలు-విజయనగరం జట్టు పై 12-1, విశాఖపట్నం-వెస్ట్ గోదావరి జట్టు పై 10-0 స్కోర్‌తో లీగ్ దశలో విజయం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగం ఆర్గనైజింగ్ కార్య దర్శి చంద్రమోహన్ రాజు తెలిపారు. బాలికల విభాగంలో ఈస్ట్ గోదావరి- అనంతపురం జట్టుపై 12-0, చిత్తూరు-ప్రకాశం జట్టుపై 10-5, నెల్లూరు- విశాఖపట్నం జట్టుపై 10-0, కర్నూలు-అనంతపురం జట్టుపై 11-1, కడప-ఈస్ట్ గోదావరి జట్టుపై 14-8, విజయనగరం-కృష్ణా జట్టుపై 15-12, శ్రీకాకుళం- చిత్తూరు జట్టుపై 12-1, గుంటూరు-నెల్లూరు జట్టుపై 7-3, కడప-అనంతపురం జట్టుపై 13-3, కర్నూలు-ఈస్ట్‌గోదావరి జట్టుపై 11-2, శ్రీకాకుళం-ప్రకాశం జట్టుపై 8-1 స్కోర్‌తో విజయం సాధించినట్లు తెలిపారు. పూల్-ఏలో గుంటూరు, నెల్లూరు, పూల్-బీలో శ్రీకాకుళం, చిత్తూరు జట్లు, పూల్-సీలో విజయనగరం, కృష్ణా, పూల్-డీలో కర్నూలు, కడప జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. అలాగే బాలురు విభాగంలో పూల్-ఏలో గుంటూరు, చిత్తూరు, పూల్-బీలో విశాఖపట్నం, వెస్ట్‌గోదావరి, పూల్-సీలో కర్నూలు, శ్రీకాకుళం, పూల్-డీలో కడప, నెల్లూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయని తెలిపారు. సోమవారం క్వార్టర్ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారులకు 17 పతకాలు



సత్తా చాటిన జిల్లా వెయిట్ లిఫ్టర్లు

కడప స్పోర్ట్స్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కొండవెలగడ గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల, బాలికలు, మహిళలు, పురుషుల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లాకు చెందిన వెయిట్‌లిఫ్టర్లు 17పతకాలు సాధించినట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ నారాయ ణరావు వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 5 బంగారు, మరో 5 వెండి, 7 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన షేక్ షావల్లి

రాజంపేట టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం ఉస్మాన్‌నగర్‌కు చెందిన షేక్ షావల్లి(28) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడు షేక్ షావల్లి డ్రైవర్‌గా పనిచేసేవాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కలసపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముసల్‌రెడ్డిపల్లె రహదారిలో ఉన్న ఎస్టీ కాలనీలో ఆదివారం అన్నపురెడ్డి శ్రీనివాసులు అలియాస్ దొమ్మరోళ్ల శ్రీను (45) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శ్రీను గత కొన్ని సంవత్సరాల నుంచి భార్యకు దూరంగా ఉంటూ కాలనీలో ఉంటున్నాడు. మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరుగుతూ ఒంటరిగా బతుకుతున్నాడు. మృతుడి కాళ్లకు తాళ్లు ఉండడం, కాళ్లు నేలకు ఆనుకొని ఉండడంతో ఎవరైన చంపి ఉరి వేశారా అనే అనుమానం పోలీసులు, స్థానికుల్లో నెలకొంది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి


మృతి చెందిన మహేశ్

కడప క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్‌లో రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్సు బండి ఢీకొనడంతో ఎంబీఏ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా బనగానపల్లె దేవినగర్‌కు చెందిన ఎం.మహేశ్ (21) కడప రాయచోటి రోడ్డులోని ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రైలు ఎక్కేందుకు ట్రాక్ దాటుతుండగా వేగంగా వచ్చిన గూడ్సు రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతుడిని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తు న్నట్లు తెలిపారు.

పుష్పగిరిలో 20 శాసనాల నకళ్ల తయారీ


శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ సిబ్బంది

వల్లూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ, పంచమనదీ క్షేత్రం పుష్పగిరి వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో 20 శాసనాల నకళ్లను ఆదివారం తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి వచ్చిన భారత పురావస్తుశాఖ తయారు చేసిందని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేశ్ తెలిపారు. పుష్పగిరి దేవాలయాల శాసనాలు దాదాపు కాపీ చేసినప్పటికీ ఎన్నో ఆలయాల శాసనాలు శిథిలమై అప్పుడప్పుడూ కొన్ని భారీ వర్షాలకు బయటపడుతున్న వాటిని వెలుగులోకి తీసుకువస్తున్నామన్నారు. అక్టోబరు 20న నాగేశ్వరస్వామి ఆలయం శాసనాలు వెలుగులోకి తెచ్చానని, దీనికి స్పందించిన భారత పురావస్తుశాఖ డైరెక్టరు మునిరత్నం రెడ్డి చెన్నై ఏపీ గ్రఫీ కార్యాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.ఏసుబాబుకు చెప్పారని ఆయన అన్నారు. ఏసుబాబు తన సిబ్బందిని పురమాయించగా ఆదివారం చెన్నై నుంచి వచ్చినవారు పుష్పగిరిలో శుభ్రపరచి నవీకరించిన శాసనాల్లో 13వ శతాబ్దానికి చెందిన తమిళం, గ్రాంధిక లిపి కలిపి ఉందని వివరించారు. ఈ గ్రామం త్రిభువనా వీర చతుర్వేది మంగళంలో భాగమై ఉందని, త్రిభువన వీర అనే పదం కులోత్తుంగ చోళ 3 బిరుదుల్లో ఒకటన్నారు. ఒక శాసన శకలం నుంచి రాజేంద్ర చోళ దేవరని అతను పొత్తాబి చోళ రాజేంద్రడనే వివరణ ఉందని చెప్పారు. శాసనాలు ఎక్కువగా ముక్కలుగా పాడైపోయి ఉన్నాయని వివరించారు. అత్యంత ప్రాచీనమైన కఠినమైన తమిళ, గ్రాంధిక లిపిలో ఉండడంతో వీటిని సులువుగా చదవడానికి వీలు లేకుండా పోయిందని, సేకరించిన వాటిని చెన్నైకి తీసుకెళ్లి అక్కడ నుండి మైసూరు ఏపీగ్రఫీ కార్యాలయానికి తీసుకెళ్లి క్షుణ్ణంగా చదవాలని చెప్పారు. శాసనాల్లో మరింత సమాచారం కోసం కొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో చెన్నై ఏపీగ్రఫీ కార్యాలయ అసిస్టెంట్ ఏపీ గ్రాపిస్ట్ వీరమణి కందన్, ఎస్టాం పేజ్ మెకానిక్‌లు ఏఏ మణికంఠన్, ఏ.కార్తవరాయన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని యువతి ఆందోళన


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న యువతి

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన షేక్ యాస్మిన్ అనే యువతి ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని ఆందోళన చేపట్టింది. తన భర్త షేక్ అప్సర్ తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, ఈ విషయమై తాను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆమె వెల్లడించింది. శుక్రవారం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటివరకు స్పందించలేదని, దీంతో తనకు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఈ సంఘటనపై సీఐ హేమసుందర్‌రావును వివరణ కోరగా యువతి ఇప్పటివరకు తన భర్త రెండో వివాహం చేసుకున్నట్లు ఆధారాలు సమర్పించలేదని, యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కోర్టు అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

బాలుడు అదృశ్యం



కడప క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కడప నగరం బముజన్ నగర్‌కు చెందిన బాలుడు అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. బహుజన్‌నగర్‌కు చెందిన అల్లం నందుకుమార్ 8వతరగతి చదువుతున్నాడు. గత నెల 23న స్కూలుకు వెళ్లాక ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయాం

● వెంకటరెడ్డిని శిక్షించండి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయమని, నిందితుడు వెంకటరెడ్డిని కఠినంగా శిక్షించాలని మదనపల్లెకు చెందిన లక్ష్మీతాయారమ్మ, కర్నూలుకు చెంది కౌశిక్ కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ అమెరికా కొలంబస్ సెంట్రల్ యూనివర్సిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ జాయిన్ చేయిస్తామని హైదరాబాద్‌కు చెందిన ఎడ్‌ప్లస్ కన్సల్టెన్సీ నిర్వాహకులు మారెడ్డి వెంకటరెడ్డి, చైతన్య విద్యార్థుల వద్ద డబ్బు వసూలు చేశారని తెలిపారు. ఆ కళాశాలలో చదవకపోయినా సర్టిఫికెట్లు ఇస్తారని నమ్మించారన్నారు. తీరా బ్యాంకు రుణం కోసం వెళ్లగా ఆ కళాశాలకు ఎలాంటి గుర్తింపు లేదని తేలిందన్నారు. దీనిపై కన్సల్టెన్సీ నిర్వాహకులను సంప్రదిస్తే 'డబ్బు తిరిగి ఇచ్చేది లేదు.. ఏం చేస్తారో చేసుకోండి' అంటూ బెదిరించారన్నారు. తెలంగాణ సీఎం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

అప్పుల బాధతో రైతు మృతి

● విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం
● చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి

దువ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన ఎం.సుబ్బరాయుడు (67) అనే రైతు అప్పుల బాధ భరించలేక గడ్డిమందు తాగి శనివారం మృతిచెందాడు. ఎస్ఐ ధనుంజయుడు తెలిపిన వివరాల మేరకు వ్యవసాయం నేపథ్యంలో సుబ్బరాయుడు సుమారు రూ.10లక్షల దాకా అప్పులు చేశాడన్నారు. వాటిని తీర్చలేనేమోనన్న భయంతో ఈనెల 4వ తేదీ అతను గడ్డి మందు తాగాడన్నారు. వెంటనే చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలుకు తరలించగా అక్కడ ఆసుపత్రిలో పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతిచెందాడని ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రైతు సుబ్బరాయుడుకు 3 ఎకరాలు పొలం ఉండగా అదనంగా ఏడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాడన్నారు. దీంతో అప్పులు సుమారు రూ.10లక్షలు ఉండడంతో ఆత్మహత్య కు పాల్పడ్డాడన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వాల్మీకిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గంగాదొడ్డి వాసి శ్రీరాములు(58) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆటో ఢీకొనడంతో గాయపడిన శ్రీరాములును చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకోండి

● శిల్పారామాన్ని తనిఖీ చేసిన సీఈవో స్వామినాయుడు


శిల్పారామం పరిసరాలను పరిశీలిస్తున్న సీఈవోస్వామినాయుడు

పులివెందుల రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన శిల్పారామంలో సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలు నిర్వహించాలని శిల్పారామం సీఈవో వి.స్వామినాయుడు సూచించారు. పట్టణంలోని శిల్పారామాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. శిల్పారామమంతా కలియతిరిగి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ శిల్పారామంలో పచ్చదనం, పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అలాగే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఉలిమెల్ల లేక్‌ను పరిశీలించి ప్రతి ఆదివారం, పండుగ రోజులలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి సందర్శకుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ సుబ్బారావు, ఉలిమెల్ల లేక్ సూపర్వైజర్ వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

వేంపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేసి పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేయడమే మనందరి లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. వేంపల్లెలోని మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఆదివారం గతంలో టీడీపీలో ఉంటూ పార్టీకి దూరంగా ఉన్న పలువురునేతలు, పలుకుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి పొట్టిపాటి మోహన్‌రెడ్డి, దేవస్థాన మాజీ సభ్యులు ప్రొద్దుటూరు తిప్పారెడ్డి, శివారెడ్డి, కొండూరు రమణయ్య, గండి దేవస్థాన పాలకమండలి మాజీ సభ్యుడు పసుపులేటి బాబు, విద్యాకమిటీ మాజీ చైర్మన్ సాదక్‌వల్లి తదితరులకు బీటెక్ రవి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, గ్రంథాలయ మాజీచైర్మన్ బాలస్వామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ మల్లికార్జున, మైనార్టీ నాయకులు యాసిన్, తక్కెళ్ల షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.





వేంపల్లి, సీకేదిన్నెలో టీడీపీలో చేరిన వారు

సీకేదిన్నె.: మండలంలోని ఇప్పెంట పంచాయతీలో మద్దిమడుగు సుగాలీబిడికి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లె సొసైటీ బ్యాంకు చైర్మన్ గంధం మోహన్ బాబు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి దాదాపు 20 కుటుంబాలు ఆదివారం చేరినట్లు తెలిపారు. రాజానాయక్, బాబూనాయక్, శ్రీనూనాయక్, మునినాయక్, నాగమునినాయక్ తదితర కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ కదువా వేసుకున్నారు. వారిని స్థానిక టీడీపీ నాయకులు పాలగిరి అయ్యవారు, ఐటీడీపీ దర్బార్ సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జబివుల్లా, రెడ్డిబాష, హబీబ్, వెంకటసుబ్బయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో కొనసాగుతున్న నిఘా



కడప క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తాగే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్, టూటౌన్, తాలుకా పోలీసుస్టేషన్ల పరిధిలో గంజాయి, బహిరంగ మద్యపానం చేసే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ అమర్‌నాథరెడ్డి , స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు. ఆదివారం నగరంలోని బుగ్గవంక పరీవాహక ప్రాంతం, గుర్రాలగడ్డ, పాతబస్టాండు, నబీకోట, తారకరామనగర్ పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని పోలీసు వర్గాలు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

కడప క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళల భద్రత, పోక్సో ప్రాముఖ్యత గురించి వివరించారు. సైబర్ మోసాలపై వివరించారు.

ఆర్టీసీ బస్టాండులో విస్తృత తనిఖీలు



కడప క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కడప ఆర్టీసీ బస్టాండులో ఆదివారం రాత్రి చిన్నచౌకు పోలీసులు అనుమానితులు, ప్రయాణికుల బ్యాగులు, బస్టాండు పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల కదలికలు, లగేజీలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు వస్తువులు కనిపిస్తే డయల్ 112కు కానీ స్థానిక పోలీసులకు కానీ సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో ఎస్ఐ రవికుమార్, చిన్నచౌకు పీఎస్‌సిబ్బంది పాల్గొన్నారు.

'డిజిటల్ అరెస్టు అనేది ఉండదు'

వేంపల్లెనవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చట్టంలో డిజిటల్ అరెస్టు అనేది ఉండదని అలా ఎవరైన ఫోన్ చేసినా, వీడియోకాల్ ద్వారా తెలియజేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ నరసింహులు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ప్రచారం చేస్తున్నారు. ప్రధానకూడళ్లలో ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ తెలిపారు. అపరిచితులు ఎవరైనా వీడియోకాల్ చేసినా స్పందించవద్దని సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ పోలీసుల పేర్లుచెప్పిన భయపడాల్సిన అవసరం లేదన్నారు. డిజిటల్ రిక్వెస్ట్ ద్వారా డబ్బులు పంపవద్దని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సమస్యలను మనోధైర్యంతో ఎదుర్కోవాలి- సీఐ



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమణ

పులివెందుల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలను మనోధైర్యంతో ఎదుర్కోవాలని పులివెందుల రూరల్ సీఐ రమణ విద్యార్థినిలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన తొండూరులోని గురుకుల పాఠశాల విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తొండూరు పీఎస్ఐ, సిబ్బంది, పాఠశాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర రైతు విభాగం మాజీ ఉపాధ్యక్షుడు మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేపుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర టీడీపీ రైతు విభాగం మాజీ ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటరమణారెడ్డి (ఎల్‌ఎల్‌ఆర్ రమణ) (68) హైదరాబాదులో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన మండలంలోని రామనపల్లెకు ఆదివారం తీసుకువచ్చారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, రామనశ్రీలక్ష్మి, రామన చంద్రమోహన్‌రెడ్డి, బుజ్జన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు. పలువురు టీడీప నాయకులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఖాజీకి నియామకపత్రం పంపిణీ

వేంపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ముస్లిం మైనార్టీకి సంబంధించి ప్రభుత్వ ఖాజీగా నియామకమైన జామియ మసీదు ఇమాం అబ్దుల్ రెహ్మాన్‌కు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్‌రవి నియామకపత్రాన్ని అందజేశారు. ముస్లిం మైనార్టీలపట్ల టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.ముస్లింలంతా టీడీపీకి అండగా ఉంటారని పలువురు మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. మైనార్టీనేతలు షబ్బీర్, మహబూబ్ షరీఫ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియ భవన్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప మారుతీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలో తొగటవీర క్షత్రియ భవన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని టీడీపీ కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి హామీ ఇచ్చారు. కార్తీకమాసం సందర్భంగా తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కడప-రాజంపేట రోడ్డు కనుమలోపల్లి వద్ద గల 108 శివలింగాల మహాలింగేశ్వరస్వామి సన్నిధిలో కార్తీకమాస వనభోజన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మాధవి హాజరై మాట్లాడారు. అనంతరం 2026 నూతన సంవత్సరం కేలండర్‌ను ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించారు. ఆ సంఘం నగర కమిటీ అధ్యక్షుడు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, నాయకులు గోవిందు నాగరాజు, బొమ్మిశెట్టి చంద్రశేఖర్, చౌడం సూరిబాబు, సుదర్శన్, ఉప్పు శంకర్, ఆంజనేయులు, బాలచౌడన్న, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



కడప కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ అవార్డు గ్రహీతలుగా ఎంపికైన జిల్లాకు చెందిన వారిని జిల్లా అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తయ్యబ్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర గల షాహీ మహల్ కన్వెంచర్‌లో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతథిగా టీడీపీ సీనియర్ నాయకుడు వి.ఎస్. అమీర్‌బాబు హాజరై అవార్డు గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమంలో అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లా శాఖ అధ్యక్షుడు సత్తార్‌ఫైజి, ప్రతినిధులు జిలానిభాష, వజీర్‌అహ్మద్, సిరాజ్‌బుఖారి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతాలమ్మ ఆలయ వార్షిక వేడుకలు

కమలాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పడమర వీధిలో శివాలయం పక్కన సీతాలమ్మ తల్లి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నతీర్థ ప్రసాదాలు అందించారు. కడప ప్రకాశనగర్‌కు చెందిన అమరేశ్వరి కోలాట బృందం మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

జూదరుల అరెస్టు

కడప క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజారెడ్డివీధిలోని పెట్రోలుబంకు సమీపంలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య తెలిపారు. కడప నగరం రాజారెడ్డివీధిలో జూదమాడు తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ అమర్‌నాథరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. కడపకు చెందిన 9 మంది జూదర్లును అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కడప మారుతీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చట్ట సభలో బీసీలకు రిజర్వేషన్స్ కల్పించాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీ.సీ. మహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేశారని అదే తరహాలో మన రాష్ట్రంలో కూడా బీసీలకు రాజకీయ, ఆర్థిక సామాజిక, రంగాలలో కల్పిస్తున్నా రిజర్వేషన్లు సక్రమంగా అమలుకావడం లేదన్నారు. సమావేశంలో నాయకులు కూకల పెంచలయ్య, పీవీ రమణ, రాంప్రసాద్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, కె. నాగిరెడ్డి, పుత్తా భాస్కర్, పాల్గొన్నారు.

చంద్రబాబు సారథ్యంలో నెంబర్ 1గా ఏపీ

కడప మారుతీనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలోనే మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా రూపుదిద్దుకోవడం జరుగుతోందని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిలానీబాష స్పష్టం చేశారు. ఆదివారం కడపలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌తో పెట్టుబడులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ 39వ డివిజన్ ఇన్‌చార్జ్ ఆరిఫ్, అక్రమ్, ఖాదర్‌బాష, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహాలకు విశేష అభిషేకాలు



చెన్నూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా కార్తీక ద్వాదశి రోజు స్థానిక మల్లేశ్వరాలయంలో కొలువు అయిన నవగ్రహాలకు ఆదివారం ఉదయం విశేష అభిషేకాలు జరిగాయి. తొమ్మిది నవగ్రహాలకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో పాటు అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



లింగాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం లింగాలలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డన్ విక్టర్, లైబ్రేరియన్ శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ హెల్పర్ జయమ్మ పాల్గొన్నారు.

కీర్తిపల్లె రహదారికి మోక్షం ఎప్పుడో...?



వర్షం కురిసినప్పుడు కీర్తిపల్లె రోడ్డు (ఫైల్)

వీరపునాయునిపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె ప్రధానరహదారి మీదుగా కమలాపురం వరకు వెళ్లే రహదారి కీర్తిపల్లె మార్గమధ్యలో గుంతలమయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీర్తిపల్లె గ్రామం వద్ద రహదారిలో ఐదు నుంచి ఆరు వరకు పెద్ద, పెద్దగుంతలు ఏర్పడి ఉండడంతో ఈ రహదారి వద్ద అనునిత్యం వెళ్లే వాహన చోదకులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతలు గుంతలుగా ఉన్న చోట మరమ్మతులు చేపట్టమని పదేపదే ఆర్‌అండ్‌బీ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని అంటున్నారు. గుంతల్లో నీరుచేరి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ద్విచక్రవాహనచోదకులు కిందపడ్డ సందర్భాలు అనేకం అన్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పడ్డ రహదారికి మరమ్మతులుచేయాలని కోరుతున్నారు.



గుంతలతో దర్శనమిస్తున్న కీర్తిపల్లె రోడ్డు

క్రమబద్ధీకరణకు చివరి అవకాశం

పులివెందుల రూరల్,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 01.01.1985 నుంచి 31.08.2025 వరకు మున్సిపాలిటీలో అనుమతులు తీసుకోకుండా చేపట్టిన అనధికార నిర్మాణాలు/అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. 12.11.2025 నుంచి 120 రోజులలోగా ఆన్‌లైన్‌లో, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్ దస్తావేజులు, సబ్‌రిజిస్ట్రార్ జారీ చేసిన ఈసీ,మార్కెట్ వాల్యూ కాపీ,బిల్డింగ్ ప్లాన్,బిల్డింగ్ ఫొటో ఇతర సంబంధిత పత్రాలతో పాటుప్రాథమిక ఫీజురూ.10వేలు చెల్లించాలన్నారు.

కృపా పరిచర్యలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీతిమంతుల నివాస స్థలం ప్రభువైన ఏసుక్రీస్తు ఆశీర్వదించడానికి అంతర్జాతీయ సువార్తీకుడు డాక్టర్ టీడీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఆదివారం కడపనగరం రూపపరిచర్యలు ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో కింగ్ ఆఫ్ కింగ్స్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలో క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృపా పరిచర్యలు పాస్టర్ జోసెఫ్ ప్రసన్నకుమార్, కడప, ప్రొద్దుటూరు నగరాలకు చెందిన పలువురు సువార్తీకులు పాల్గొన్నారు.

'మేనేజ్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్స్‌ను తొలగించిన పద్మావతి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సర్వీసింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా పది, పదిహేను సంవత్సరాలుగా ఈ కార్మికులు పనిచేస్తున్నారని గుర్తుచేశారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ పాత కార్మికులను తొలగించి,కొత్త వర్కర్ల పేరుతో లక్షలాది రూపాయలు చేతులు మారడానికి అవకాశం కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కనులపండువగా బ్రాహ్మణ వన భోజనం



కమలాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం పట్టణ సమీపంలోని తిరుకొండాలమ్మ ఆలయం వద్ద మామిడి వనంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ వన భోజన కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బ్రాహ్మణులు విరివిగా తరలివచ్చారు. ఉదయం 11గంటలకు కమలాపురం బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నెమలి వెంటరమణరావు దంపతుల ఆధ్వర్యంలో ప్రారంభమైంది. కడప పట్టణానికి చెందిన అమరేశ్వరుడి బృందం ఆధ్వర్యంలో బ్రాహ్మణ మహిళ, పురుష బృందాలు లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం పఠనం కీర్తనలు ఆలపించారు. కాగా ఈ కార్యక్రమంలో కాశిభట్ల సత్యసాయినాథశర్మ,పైడికాల్వ హరిస్వామి, బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు గోపినాథశర్మ, బ్రాహ్మణ సంఘం జిల్లా నేతలు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియుల వనభోజనం...



వనభోజన కార్యక్రమంలో తొగటవీర క్షత్రియులు

వేంపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో కార్తీక మాసం వనభోజన కార్యక్రమం ఆదివారం గండి రోడ్డులోని శ్రీచౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ కళ్యాణమండపం వద్ద ఘనంగా నిర్వహించారు. తొగట వీర క్షత్రియులు కలిసి సంతోషంగా వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు జరిగే సీపీఐ ఆందోళనలు జయప్రదం చేయండి

కడపసెవెన్ రోడ్స్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం-ఆత్మగౌరవం కోసం దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ సీపీఐ చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 18న చేపట్టిన ఆందోళనలు జయప్రదం చేయాలని ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య నాగసుబ్బారెడ్డి, వీరశేఖర్, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించాలంటూ ఎస్టీయూ జిల్లా నాయకులు ఎమ్మెల్యే మాధవిని కలిశారు. సీనియర్ ఉపాధ్యాయులకు తిరిగి టెట్ విధించడం అనవసరమైన భారమని, వయోవృద్ధ ఉపాధ్యాయులకు ఇతర సబ్జెక్టుల ప్రశ్నాపత్రాలు రాయమంటూ ఒత్తిడి చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులుపాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌లను ప్రారంభించిన శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

పులివెందుల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని 20, 22 వార్డులకు సంబంధించి మినరల్ వాటర్ ట్యాంక్ వాహనాలను ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) ప్రారంభించారు. స్థానిక శేషారెడ్డి స్కూల్ ప్రాంతంలో వాహనాలకు టెంకాయ కొట్టి వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, అమర్‌నాథ్‌యాదవ్ తదితరులుపాల్గొన్నారు.



ప్రారంభోత్సవానికి హాజరైన శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

పూర్తి సరే.. ప్రారంభం ఎప్పుడో..?

- శిథిలావస్థలో పాత బస్టాండు భవనాలు
- పైకప్పుకు పెచ్చులూడుతున్న దృశ్యం
- చిన్నపాటి వర్షాలకే చెరువును తలపిస్తున్న బస్టాండు ప్రాంగణం(ఫైల్)
- నిధులు లేక ఆగిన కల్వర్టు పనులు
- ప్రయాణికుల ఇబ్బందులు తొలిగేదెన్నడో ?



ప్రారంభానికి నోచుకోని నూతన ఆర్టీసీ బస్టాండు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో వేలాది మంది ప్రజల రాకపోకలకు కేంద్ర బిందువుగా ఉన్న ఆర్టీసీ కొత్త బస్టాండ్ ప్రారంభానికి నోచుకోక ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. ప్రస్తుతం ఉన్న పాత బస్టాండు పైకప్పు పెచ్చులూడుతుండడమే కాక శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం కొత్త బస్టాండు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసి రూ.4.50 కోట్లు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసినా కల్వర్టునిర్మాణం జరుగక నూతన బస్టాండు ప్రారంభానికి నోచుకోలేకపోతోంది.కొద్దిపాటి వర్షం పడితే చాలు బస్టాండ్ ప్రాంగణం చెరువును తలపిస్తోంది. ఇక మరుగుదొడ్లు సమీపంలో లేకపోవడం ఇలా అన్నీ సమస్యలుగానే మారుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండులోని షాపులు కూడా అరకొర వ్యాపారాలతో ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బస్టాండు ప్రారంభం ఎప్పుడు అవుతుందోనని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. నగరాభివృద్ధిలో కీలకమైన ఈ ప్రాజెక్టుపై అధికారులు మరింతశ్రద్ధ చూపి పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి నూతన బస్టాండు

ఆర్టీసీ బస్టాండుసమీపంలో కొత్తపల్లె పంచాయతీ అధికారులు కాలువల నిర్మాణం వద్ద తీసినగుంతల వద్ద కల్వర్టు నిర్మించడానికి నిధులు లేక పనులను ఆపివేయడం జరిగింది. ఈ సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకుపోగా ప్రజల సౌకర్యార్థం బస్టాండు నుండి బస్సులు బయటకు వచ్చే ప్రదేశంలో కల్వర్టు నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించి నూతన ఆర్టీసీ బస్టాండును ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొని వస్తాం.

- పోతురాజు, ఆర్టీసీ డీఈ

నేటి నుంచి పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు

కొండాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. ఈ నెల 17న కోడూరు జడ్పీ హైస్కూల్, ఈ నెల 18న దత్తాపురం జడ్పీహైస్కూల్, 19 న తాళ్లప్రొద్దుటూరు జడ్పీహైస్కూల్, 20న బెడుదూరు జడ్పీ హైస్కూల్, 21న లావనూరు జడ్పీ హైస్కూల్, 22న కొండాపురం జడ్పీ హైస్కూల్, 24న చౌటిపల్లె జడ్పీ హైస్కూల్, 25న చౌటిపల్లె గురుకుల పాఠశాల, 26 న కొండాపురం సీఎంఆర్‌నగర్ ఎలి మెంటరీ స్కూల్‌లో ఆధార్ క్యాంపులు జరుగుతాయి. విద్యార్థులు ఆధార్‌లో పుట్టినతేది, బయోమెట్రిక్, అడ్రస్ మార్పు , పేర్లలో తప్పులు వంటి వాటిని సరిచేయిచ్చుకోవచ్చని ఎంపీడీవో తెలిపారు.

ఎర్రగుంట్లలో: మండలంలోని ప్రాథమిక, జడ్పీ హైస్కూళ్లలో విద్యార్థుల కోసం సోమవారం నుంచి ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. చిర్రాజుపల్లె, నిడిజువ్వి, చిన్నందడ్లూరు, ఇల్లూరు గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తారన్నారు. కొత్త ఆధార్ కార్డుల తోపాటు, ఆధార్‌కార్డుల్లో చిరునామా, ఫోన్ నెంబర్ల మార్పు చేసుకోవచ్చన్నారు. 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఈ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోరుమామిళ్లలో: పోరుమామిళ్ల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉపేంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని స్కూళ్లల్లో సోమవారం నుంచి ఈ నెల 26 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. 5నుంచి 15 సంవత్సరాల వయసుగల వారి బయోమెట్రిక్, పేరు, అడ్రస్, పుట్టినతేదీ తదితర వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు వీలుంటుందన్నారు. సోమవారం పోరుమామిళ్లలో ఓఎల్ఎఫ్ హైస్కూలులో ఆధార్ స్పెషల్ క్యాంపులు ఉంటాయన్నారు.

జ్యోతి ఉత్సవాలు ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రామేశ్వరం, వసంతపేట, సుబ్బిరెడ్డికొట్టాలు, శ్రీరాంనగర్, సూపర్‌బజార్‌రోడ్డు, విజయనగరం వీధి, ఆర్ట్స్‌కాలేజీ రోడ్డు, వినాయకనగర్ ప్రాంతాల్లో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, పూలు, ఆభరణాలతో అలంకరించి కలశాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కలశాలను తలపై ఉంచుకుని భక్తులు నృత్యాలు చేశారు. సోమవారం ఉదయం వరకు జ్యోతి మహోత్సవాలు ఘనంగా జరుగాయి.

ముక్తిరామలింగేశ్వరుడికి ఘనంగా బిల్వార్చన



సైకతలింగం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం ఆలయ పండితుల మంత్రోచ్ఛారణలతో సైకత లింగానికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయంలో హనుమత్‌లింగేశ్వరస్వామికి, కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోరుమామిళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లీడు గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు కావస్తున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, గిరి ప్రణీత్‌రెడ్డి, సిద్దమూర్తి రాజారెడ్డి, గాజులపల్లె రవిచంద్రారెడ్డి, రాజీవ్‌బాషా, నరసింహులు నల్లేరు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

కళాకారులు ఐకమత్యంగా ఉండాలి

పోరుమామిళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కళాకారు లు ఐకమత్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని బద్వేలు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని మల్లకతవ సమీపంలో ఉన్న వెంకటేశ్వర కళ్యాణమండపంలో ఏపీ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నూత న కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాకారులంతా ఏకమై చెక్క భజన గురువు రవికుమార్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. టీడీపీ నాయకులు క్రిష్టారెడ్డి, పోలిరెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. భావన్నారాయణస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రామేశ్వరంలోని భద్రావతి, భావన్నారాయణస్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణంను కన్నుల పండువగా కమనీయంగా నిర్వహించారు. ఉదయం మహాశివుడు, భద్రావతి, భవన్నారాయణస్వామికి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, మార్కండేయస్వామికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులను చేసి మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలతో వేద పండితులు స్వామివారి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరాంనగర్‌లోని భద్రావతి, భావన్నారాయణస్వామి ఆలయంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా కార్తీక వన మహోత్సవం



వనమహోత్సవానికి హాజరైన ప్రజలు

గోపవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలంలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసపురం వద్ద వేరు వేరు ప్రాంతాల్లో బలిజ సంఘం, ఆర్యవైశ్య సఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన మహోత్సవం ఏర్పాటు చేశారు. ఉదయం ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బలిజ సంఘం టీడీపీ సీనియర్ నాయకుడు బలిశెట్టి హరిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. మధ్యాహ్నం కార్తీక వన భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్మమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాసరి సంక్షేమ సొసైటీ డెరెక్టర్‌గా గోవింద్ సుబ్బయ్య

మైదుకూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర దాసరి సంక్షేమ సొసైటీ డెరెక్టర్‌గా ఖాజీపేట మండలం పూసల కొట్టాలుకు చెందిన గోవింద్ సుబ్బయ్య ఎన్నికయ్యారు. ఆదివారం ప్రొద్దుటూరులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గోవింద్ సుబ్బయ్య కలిసి పూలమాల, శాలువలతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో పార్టీలో రాష్ట్ర పదవి అందించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ టీడీపీ కోసం పనిచేవారికి, పార్టీలో సముచిత న్యాయం ఉంటుందని తెలిపారు.

వేగవంతంగా స్టీల్‌ప్లాంట్ ప్రహారీ నిర్మాణం

జమ్మలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపురాళ్లపల్లె, కన్నెతీర్థం గ్రామాల మధ్య స్టీల్‌ప్లాంట్‌కోసం వేసిన శిలాఫలకం వద్ద ప్రహారీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గత రెండు నెలల క్రితం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇచ్చిన నిబంధనల మేరకు జిందాల్ గ్రూపు ప్రతినిధులు, ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఉత్తరం భాగాన గతంలో కొంత గోడ నిర్మాణం జరిగింది. అక్కడి నుంచి ప్రస్తుతం కన్నెతీర్థం ఆలయంవైపు దక్షిణ బాగాన ప్రహారీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పోరుమామిళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ కల్లూరి బీబీ (42) అనే మహిళ మృతి చెందింది. పోరుమామిళ్ల మండలంలోని కాల్వకట్టకు చెందిన కల్లూరి బీబీ అనే మహిళకు 11 సంవత్సరాల క్రితం ఆమె భర్త చిన్న వీరయ్య మృతి చెందాడు. మృతురాలు ఈ నెల 14న విష రసాయ నం తాగడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ శనివారం మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలున్నాయని విచారించి తగు న్యాయం చేయాలని మృతురాలి కుమారుడు నాయబ్ రసూల్ ఆదివారం రాత్రి స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వామిత్వ ప్రత్యేక గ్రామసభలు

రాజుపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల ంలోని వివిధ గ్రామాల్లో స్వామిత్వ గ్రామసభలు ఈ .నెల 18 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామనాధరెడ్డి తెలిపారు. 18న సాయంత్రం పొట్టిపాడు, 19న గోపాయపల్లె, 20న ఉదయం దద్దనాల, మధ్యాహ్నం గాదెగూడూరు, 21న ఏరువపాలెంలో మధ్యాహ్నం తొండలదిన్నె, 22న కొరపాడు, మద్యాహ్నం పగిడాల గ్రామాల్లో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో ఇళ్లస్థలాల, ఆస్తులకు సంబంధించి ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



కొండాపురం లైబ్రరీలో వక్తృత్వ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

కొండాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు 58వ గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు లైబ్రరీయన్ వరలక్ష్మి తెలిపారు. గ్రథాలయాలకు రావడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ఖాజీపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది కార్తీక 4వ సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గణపతి పూజ, ప్రధాన కలశస్థాపన, పూర్ణాహుతి, 12 గంటలకు అన్నదానం, ఒంటి గంటకు ప్రధాన కలశం లక్కీడ్రా, 1.30 గంటలకు లడ్డూ వేలం పాట, సాయంత్రం 3 గంటల నుంచి 10 గంటల వరకు అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పత్తి క్రిష్టారెడ్డి మాట్లాడుతూ కలశం ఎత్తుకునే కన్నెస్వాములు ఉపవాసంతో ఉండాలని, వారికి కావాల్సిన సౌకర్యాలు, దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు సామాగ్రి కూడా ఆలయ కమిటీ అందిస్తుందన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

జమ్మలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో భాగస్వాములు కావాలని మానవతా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి సూచించారు. ఆదివారం మానవతా ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తంలో చక్కెర స్థాయి క్రియాటిన్, బ్యాడ్‌కొలెస్ట్రాల్ వంటి పరీక్షలు నిర్వహించారు. 183 మంది రక్త పరీక్షలు చేయించుకున్నట్లు వారు తెలిపారు. మానవతా ద్వారా విద్యార్థులకు నైతికల విలువల బోధన, వైద్యసేవలు, పర్యావరణ పరిరక్షణ, మార్చురీ ఫ్రీజర్లు, శాంతిరథం, ఆత్మీయ సహకారం వంటి ఆశయాలతో ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలి



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌టీయూ నాయకులు

మైదుకూరు నవంబరు16 (ఆంధ్రజ్యోతి):ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు మైదుకూరు ఎస్‌టీయూ నాయకులు ఆదివారం స్థానిక శాసనసభ్యుడు పుట్టా సుదాకర్‌యాదవ్‌ను ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. 20-30 ఏళ్ల సర్వీసు ఉన్న సీనియర్ టీచర్లను టెట్ రాయమనడం అసంబద్ధమన్నారు. 50ఏళ్లు నిండిన ఉపాధ్యాయులకు వారి సబ్జక్టు కాని సిలబస్‌తో పరీక్ష రాయమనడం భారమవుతుందన్నారు. విద్యాహక్కు చట్టం 2009 ని సవరించాలని,సుప్రీంకోర్టులో వేసిన రివ్యూపిటిషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు విన్న ఎమ్మెల్యే సుదాకర్ యాదవ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

సకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించండి

మైదుకూరు నవంబరు16(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలను సకాలంలో సత్వరం పరిష్కరించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఎక్కువ పిర్యాదులు రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ, రోడ్లు, భూ ఆక్రమణలు, పక్కాగృహాలు తదితర సమస్యలపైన వచ్చినట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష వైఖరిని మందలిస్తూ ప్రజా సమస్యలపైన శ్రద్ధ చూపి బాధ్యతగా పని చేయాలన్నారు. వీది ధీపాలు, పారిశుధ్యం, నీటి వసతులపై ఆరా తీశారు. శ్మశాన స్థలాల ఆక్రమణలను సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదికారులను ఆదేశించారు.

డ్రైవరు సుబ్బిరెడ్డిని విధుల్లోకి తీసుకోవాలి



గేట్ మీటింగులో మాట్లాడుతున్న ఎన్ఎంయూ వర్కింగ్ ప్రెసిడెంటు జనార్దన్‌రావు

బద్వేలు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు డిపోలో డ్రైవరుగా పనిచేస్తున్న సుబ్బిరెడ్డి అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేసి బద్వేలు డిపోలోనే విధుల్లోకి తీసుకోవాలని ఎన్ఎంయూ వర్కింగ్ ప్రెసిడెంటు సూరా జనార్ధనరావు డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ఎర్రబ్యాడ్జీలు ధరించి టీ విరామ సమయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం విజయవంతంగా నడపడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు మెకానిక్‌ల అక్రమ సస్పెన్షన్లను అక్రమ డిబెట్స్‌ను ఛార్జిషీట్‌లు రద్దు చేయాలన్నారు. ఇప్పటి కైనా కడప డీపీటీవో త్వరితగతిన విచారణ జరిపి సుబ్బిరెడ్డిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ చంద్రయ్య, కేవీ రమణ, ఎంఎస్ రాయుడు, కెఎస్ రాయుడు, సీసీఎస్ డెలిగేట్ మల్లిఖార్జున, ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయండి



ఉపాధ్యాయ సంఘాల నాయకులకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బదిలీ అయిన రిలీవ్‌కాని ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకుల దృష్టికి తెచ్చారు. తమను రిలీవ్ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బదిలీ పొంది ఆరు నెలలు అయినా రిలీవర్స్ రాలేదనే సాకుతో పాత పాఠశాలలోనే కొనసాగించడం తగదన్నారు. అనేక మంది ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలతో దూర ప్రాంతాల్లో పనిచేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల ఇబ్బందులను గుర్తించి వారిని నూతన పాఠశాలకు పంపడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఎస్టీయూ రీజినల్ కన్వీనర్ సలీం, ఓబుళరెడ్డి, వీరయ్య, మురళీమోహన్, రమేష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం తప్పనిసరి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని రచయిత జింకా సుబ్రమణ్యం పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో విద్యార్థులకు స్టోరీ రీడింగ్, ఉపన్యాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని ఆర్జించాలని సూచించారు. ప్రతిరోజు కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

'గొరిగె వెంకటేశ్వర శతకం' పుస్తకావిష్కరణ



గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు శాఖ గ్రంథాలయంలో ఆదివారం గొరిగె వెంకటేశ్వర శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, జింకా సుబ్రమణ్యం, లోకా జగన్నాథశాస్త్రులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ శతకాన్ని గుండ్లకుంటవాసీ అయిన గొరిగె వెంకటేశ్వర్లు రచించారు. ఆయన 1989 నుంచి తన వాణిని ఆకాశవాణిలో వినిపిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షుడు శివగణపతి, లైబ్రేరియన్ నాదేండ్ల బాబ్జి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, ఆర్.గురుకుమార్, గొంటుముక్కల గోవిందు, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ దస్తగిరి

ముద్దనూరు నవంబర్16(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతపై సీఐ దస్తగిరి అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రక్షణ చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు. గృహహింస, లైంగిక వేధింపులు వంటివి చట్టపరంగా శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. మహిళా భద్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

కొండాపురంలో: మహిళల భద్రతపై కొం డాపురం బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం కొండాపురం సీఐ రాజా, ఎస్సై ప్రతాప్‌రెడ్డిలు విద్యార్థినుల కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైన అకతాయిలు వేధించినా, అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులలో 112 కు ఫోన్ చేయలన్నారు. ఒత్తిడి లేని చదువు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.